# అధిక స్థాయిల్లో నిరోధం




**సమీక్ష:** వరుసగా మూడు వారాల అమ్మకాల ఒత్తిడి అనంతరం గత వారం సెన్సెక్స్ 830 పాయింట్ల లాభంతో ముగిసింది. దేశీయ, అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలపై విడుదలైన గణాంకాలు మార్కెట్ కోలుకోవడానికి దోహదం చేశాయి. ఐర్లాండ్‌కు అత్యవసర సాయం కింద 11,300 కోట్ల డాలర్ల ప్యాకేజీ ఇవ్వడానికి యూరోపియన్ యూనియన్ (ఈయూ) అంగీకరించడంతో వారం తొలి రోజున మార్కెట్ లాభాలతో ప్రారంభమైంది. తక్కువ ధరల వద్ద షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికానికి అంచనాలకు మించిన జీడీపీ వృద్ధిరేటు (8.9 శాతం), అక్టోబరుకు మౌలిక పరిశ్రమల వృద్ధిరేటు 7 శాతం నమోదు కావడం, ఎంఓఐఎల్ పబ్లిక్ ఇష్యూకు మంచి స్పందన, ఎగుమతి, దిగుమతుల గణాంకాలు మార్కెట్‌ను ముందుకు నడిపించాయి. ఆహార ద్రవ్యోల్బణం 8.6 శాతానికి దిగిరావడంతో గురువారం ఒక దశలో సెన్సెక్స్ 20084 పాయింట్ల గరిష్ఠ స్థాయిని తాకింది. శుక్రవారం స్థిరీకరణ జరిగి మొత్తం వారానికి 4.19 శాతం లాభంతో సెన్సెక్స్ 19,667 పాయింట్ల వద్ద ముగిసింది. వరుసగా రెండో వారం కూడా విదేశీ సంస్థాగత మదుపుదారులు, మ్యూచువల్ ఫండ్‌లు నికర కొనుగోళ్లు కొనసాగాయి. ఎఫ్ఐఐలు నికరంగా ఈక్విటీ మార్కెట్‌లో రూ.1,701 కోట్ల పెట్టుబడులు పెట్టగా.. మ్యూచువల్ ఫండ్‌లు రూ.110 కోట్లకు నికర కొనుగోళ్లు చేశాయి.

**రంగాల వారీగా:** గృహ రుణ కుంభకోణం ప్రకంపనలతో అంతక్రితం వారం అమ్మకాల ఒత్తిడికి లోనైన స్థిరాస్తి రంగ షేర్లు గత వారం పుంజుకున్నాయి. తాజాగా కొన్ని బ్యాంకులకు ప్రభుత్వం మూలధనాన్ని సమకూర్చడం, ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టడం వంటి అనుకూల పరిణామాలతో బ్యాంకింగ్ షేర్లకు కూడా మద్దతు లభించింది. ఎఫ్ఎంసీజీ, దీర్ఘకాల మన్నిక ఉత్పత్తులు, విద్యుత్ రంగాలకు చెందిన షేర్లు మదుపుదారులను ఆకర్షించలేకపోయాయి. శుక్రవారం లాభపడిన, నష్టపోయిన షేర్ల నిష్పత్తి 1:3 ఉంది. కీలకమైన సూచీలు కొలుకున్నా.. మార్కెట్ విస్తృతి ఇంకా బలహీనంగానే ఉందన్న విషయాన్ని ఇది సూచిస్తోంది.

**ఈ వారంపై అంచనా:** అంతక్రితం వారాల్లో నష్టపోయిన మార్కెట్ గత వారం కోలుకుంది. ఒక వేళ ఈ వారంలో సెన్సెక్స్ 20,060 పాయింట్ల పైన ముగిస్తే కోలుకోవడం కొనసాగవచ్చు. 19,525 స్థాయికి దిగువన స్థిరపడితే.. స్వల్పకాలానికి దిద్దుబాటు కొనసాగవచ్చు. ఇంకా తగ్గి 19,000 పాయింట్ల దిగువన ముగిస్తే.. మధ్య కాలానికి 200 డీఎంఏ స్థాయి అయిన 18,278కి సెన్సెక్స్ చేరవచ్చు. ఎఫ్ఐఐల కొనుగోళ్లు కొనసాగితే.. దిగువ స్థాయిల వద్ద మార్కెట్‌కు మద్దతు లభించొచ్చు. పారిశ్రామిక ఉత్పత్తి గణాంకాలను ప్రభుత్వం ఈ వారంలో విడుదల చేయనుంది. పారిశ్రామిక ఉత్పత్తి వృద్ధిరేటు ప్రోత్సాహకరంగా ఉంటే సెంటిమెంట్ మెరుగుపడవచ్చు. ఈ వారంలో ముడి చమురు ధరలు పెరిగే సంకేతాలు అందుతున్నాయి. ముడి చమురు ధరలు పెరిగితే సబ్సిడీ మరింత భారం అవుతుంది కనుక 'పెట్రో' ఉత్పత్తులను విక్రయిస్తున్న కంపెనీల షేర్లను విక్రయించవచ్చు. ఇతర కమోడిటీస్ ధరల్లో పెరుగుదల మార్కెట్ జోరుకు అడ్డుపడవచ్చు.

**నిరోధ స్థాయిలు:** 20,108, 20,267, 20,418; **మద్దతు స్థాయిలు:** 19,769, 19,504, 19,341

**అధిక స్థాయిల వద్ద మార్కెట్‌కు నిరోధం ఎదురయ్యే అవకాశం ఉంది.**

*– సతీశ్ కంతేటి, జెన్ సెక్యూరిటీస్*